క్లుప్తంగా

మనుబోలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో మనుబోలమ్మ

మనుబోలు: మనుబోలు పెద్ద చెరువు గట్టున కొలువైన గ్రామదేవత మనుబోలమ్మకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పాడి పంటలతో కళకళలాడాలని కోరుకుంటూ అమ్మవార్లకు సలిపిండి, పానకాలు, పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. అర్చకుడు ఫణీంద్రశర్మ గ్రామదేవతకు ప్రత్యేకాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత



మనుబోలు: మండలంలోని జట్లకొండూరు గ్రామంలో వార్డు సభ్యుడు కోడూరు వెంకటరమణయ్య భార్య రామసుబ్బమ్మకు పెరాలసిస్ రావడంతో ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆవుల తులసీరాం ఆదివారం ఆమెకు రూ.12 వేల ఆర్థిక సాయం అందించి వైద్యం చేయించారు. ఆయన వెంట శ్రీనివాసులు, సురేష్, వెంకయ్య, సాయి, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా మహబూబ్‌బాషా



మహబూబ్‌బాషా

కొడవలూరు: సీపీఎం మండల కార్యదర్శిగా యల్లాయపాళేనికి చెందిన సయ్యద్ మహబూబ్‌బాషా ఎంపికయ్యారు. నార్తురాజుపాళెంలోని ఏఎంసీ ప్రాంగణంలో ఆ పార్టీ మూడో మండల మహాసభ ఆదివారం జరిగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అధ్యక్షతన జరిగిన మహాసభలో ఆయన్ను మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో పాటు మరో పది మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. భూలోకం కాంతారావు, గోనె దయాకర్, డి.నాగమ్మ, తలారి నరసింహ, వి.నరసయ్య, చిట్టిబాబు, ఎస్.సురేష్, కె.మాల్యాద్రి, ఎం.వెంకటసుబ్బయ్య, దేవసేనమ్మలు సభ్యులుగా ఎంపికయ్యారు.

ఘనంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు



పోటీలో తలపడుతున్న ఎడ్లు

కోవూరు: మండలంలోని గంగవరం గ్రామంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలో నెల్లూరుతో పాటు బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి మొత్తం 25 ఎడ్ల జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన పోటీలో గంగపట్నం ఎడ్లు మొదటి స్థానంలో నిలిచాయి. అనంతరం నిర్వాహకులు విజేతలకు ప్రశంసాపత్రం, ట్రోఫీని అందజేశారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీపై కేసును వేదాయపాళెం పోలీసులు ఆదివారం నమోదు చేశారు. వివరాలు.. బుజబుజనెల్లూరులోని బీజేపీ కాలనీలో నివాసం ఉంటున్న విష్ణువర్ధన్ తన యమహా బైక్‌పై జాతీయ రహదారిలోని ఓ కేఫ్‌కు ఈ నెల 14న వెళ్లారు. బయట నిలిపి టీ తాగొచ్చేసరికి వాహనం అదృశ్యమైంది. గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

• ఇంటి ముందు నిలిపిన బైక్ చోరీకి గురైంది. వివరాలు.. సుందరయ్య కాలనీలోని జాషువానగర్‌కు చెందిన ప్రసాద్ వేదాయపాళెంలోని ఓ బార్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. తన బైక్‌ను ఇంటి ముందు ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం నిలిపారు. భోజనం చేసి బయటకొచ్చేసరికి అదృశ్యమైంది. గాలించినా ప్రయోజనం లేకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు.

కూలే స్థితిలో హాస్టల్ భవనం



చిన్నచెరుకూరులో 1950లో నిర్మించిన హాస్టల్ భవనం

తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరు ఎస్సీ బాలుర హాస్టల్‌ను 1950వ సంవత్సరంలో నిర్మించారు. ఇక్కడ 6 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 60 మంది పిల్లలు ఉన్నారు. వసతి గృహం ప్రహరీ, భవనం కూలేస్థితిలో ఉన్నాయి. ఇటీవల కాలంలో మరమ్మతులు కూడా చేసిన దాఖలాలు లేవు. పిల్లలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. బాత్‌రూమ్‌లకు తలుపు లేక ఆరుబయటే స్నానాలు చేయాల్సి వస్తోంది.



స్టడీ అవర్‌లో నేలపై కూర్చుని ఉన్న విద్యార్థులు

సంక్షోభ హాస్టళ్లు

రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఇప్పటికే రెండు పర్యాయాలు సంక్షేమ వసతి గృహాల్లో వసతుల కల్పనపై తీవ్రంగా మందలించినా ఫలితం లేకుండాపోయింది. తాజాగా వారం రోజుల క్రితం కూడా న్యాయస్థానం ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల సౌకర్యాలపై తీవ్ర వ్యాఖ్యలు చేసి వెంటనే సదుపాయాలు కల్పించాల్సిందిగా ఆదేశించింది. అయినా పాలకుల్లో ఎలాంటి మార్పు రావడం లేదు.

- శిథిలమైన వసతిగృహ భవనాలు
- మరుగుదొడ్లు నిరుపయోగం
- కనీస వసతులకూ ఇబ్బందులు
- కొరవడిన పర్యవేక్షణ

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు మొత్తం 18 ఉన్నాయి. వెంకటాచలం మండలం చెముడుగుంట, సర్వేపల్లి హాస్టళ్లలో విద్యార్థులు చేరకపోవడంతో వాటిని మూసివేశారు. పొదలకూరు మండలంలో ఎస్సీ, బీసీ హాస్టళ్లు 8 ఉండగా పొదలకూరు ఎస్సీ బాలికల హాస్టల్‌కు సొంత భవనం లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఇటీవల రిపేర్లు చేయడంతో వసతులు ఏర్పడ్డాయి. ఇదే మండలం మహ్మదాపురంలో దొడ్ల డెయిరీ వారు సీఎస్సార్ ఫండ్స్‌లో హాస్టల్ భవనాలను చక్కగా నిర్మించారు. ముత్తుకూరులో సంక్షేమ హాస్టల్ ఒక్కటి ఉండగా దానిని కూడా తొలగించారు. తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరు, తోటపల్లిగూడూరు గ్రామాల్లో మొత్తం నాలుగు హాస్టళ్లు ఉన్నాయి.

కనీస వసతులు కూడా లేకుండా పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలుతాయోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. పర్యవేక్షణ కూడా అంతంతమాత్రంగానే ఉండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



వెంకటాచలం బీసీ హాస్టల్లో అధ్వానంగా మరుగుదొడ్లు



చిన్నచెరుకూరులో తలుపుల్లేకుండా స్నానం చేస్తున్న విద్యార్థి

కోవూరు నియోజకవర్గంలో..

ఎస్సీ వసతి గృహాలు	10
విద్యార్థుల సంఖ్య	794
బీసీ వసతి గృహాలు	9
విద్యార్థుల సంఖ్య	701



బీసీ హాస్టల్లో అపరిశుభ్ర వాతావరణంలో వంట గది

బిక్కుబిక్కుమంటూ..



కోవూరులో శిథిలావస్థకు చేరిన బీసీ హాస్టల్

కోవూరు: నియోజకవర్గంలోని వసతి గృహాలు సమస్యల నిలయంగా మారింది. అనేక చోట్ల శిథిల భవనాల్లో హాస్టళ్లను నిర్వహిస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వీరి అవస్థలు వర్ణనాతీతం. కోవూరు మండలంలోని వసతి గృహాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. పాత భవనాలు కావడంతో చిరు వర్షం కురిసినా ఆయా హాస్టళ్లలో గోడలు ఉరుస్తుంటాయి. అంతేకాకుండా కరెంట్ వైర్లు తడవడంతో పాటు సాకెట్లు, ప్లగ్ పాయింట్ల దగ్గర నుంచి చిటపటా శబ్దాలు వస్తుంటాయి. దీనివల్ల చాలా సందర్భాల్లో షార్ట్ సర్క్యూట్ అయి విద్యుత్ సరఫరా నిలిచిపోయి రాత్రి వేళల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. చాలా వసతి గృహాల్లో గోడలు చీలి, సిమెంట్ పెచ్చులు ఊడి పడిపోతున్నాయి. నిర్వహణ సక్రమంగా ఉండకపోవడంతో రాత్రి వేళల్లో పాములకు ఆవాసంగా మారుతోంది.



నిద్రించే చోటు లేకుండా ఉన్న కోవూరులోని ఎస్సీ-2 బాలికల హాస్టల్ గది

భయం గుప్పెట్లో..

తోటపల్లిగూడూరు మండలం నరుకూరు హాస్టల్ భవనంలో నిద్రిస్తున్న విద్యార్థులు భయం గుప్పెట్లో కాలం వెళ్లదీస్తున్నారు. శిథిల భవనం కావడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భీతిల్లుతున్నారు. ముత్తుకూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో సుమారు 600 మంది విద్యార్థినులు చదువుకొంటున్నారు. శుభ్రమైన వాతావరణంలో భోజనాలు తయారు చేస్తున్నప్పటికీ చిన్న తరగతుల విద్యార్థినులు కటిక నేలపై కూర్చుని భోజనం చేయాల్సిన దుస్థితి నెలకొంది. మనుబోలులో ఎస్సీ బాలుర, బాలికల హాస్టళ్లు, బద్దెవోలులో బీసీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. ఈ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎస్సీ బాలుర వసతిగృహం కూలేస్థితిలో ఉంది. ఇక్కడి సంక్షేమాధికారిణి అనిత భయం గుప్పెట్లో కాలం వెళ్లదీస్తున్నట్టు తెలిపారు. అద్దె భవనంలోకి మారేందుకు అధికారులు అనుమతి ఇవ్వాల్సిందిగా వేడుకుంటున్నారు. ఈ హాస్టల్లో 40 మంది పిల్లలు ఉంటున్నారు. వెంకటాచలంలో బీసీ హాస్టల్‌ను రెండుగా విభజించి చిన్న పిల్లలకు అద్దె భవనంలో వసతి గృహం ఏర్పాటు చేశారు. ఇంటర్ విద్యార్థులకు శిథిల భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ భవనంలో మరుగుదొడ్లకు కనీసం తలుపులు కూడా లేవు.



కోవూరులోని ఎస్సీ-1 బాలికల హాస్టల్లో విద్యార్థులు నిద్రించే వరండా

అనేక సార్లు ఫిర్యాదులు

కోవూరులోని హాస్టళ్ల పరిస్థితులపై విద్యార్థులు, తల్లిదండ్రులు, వార్డెన్‌లు అనేక సార్లు అధికారులు, కలెక్టర్‌కు విన్నవించారు. ఆయా సందర్భాల్లో వారు తనిఖీలు చేసి కంటితుడుపు చర్యలు తప్ప శాశ్వత పరిష్కారం చూపించడం లేదు.

అవినీతిని నిరూపిస్తే జైలుకెళ్లేందుకు సిద్ధం

• కాకాణి పూజిత

వెంకటాచలం: మా నాన్నను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిందని, ఏ ఒక్క కేసులోనైనా అవినీతిని నిరూపిస్తే తానూ జైలుకెళ్లేందుకు సిద్ధమని కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత సవాల్ విసిరారు. మండలంలోని సర్వేపల్లిలో రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని నివాసాలకు వెళ్లి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా, పూర్తి చేశామని చెప్పడం దారుణమన్నారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాల్సి వస్తుందంటూ కూటమి నేతలే మాట్లాడుతున్నారంటే, హామీలిచ్చే ముందు ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు. జగనన్న పాలనలో ఇచ్చిన హామీలతో పాటుగా, ఇవ్వని హామీలను కూడా నెరవేర్చారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అసలు ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సర్వేపల్లి నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ జరగని అభివృద్ధి పనులు, గత వైఎస్సార్‌సీపీ పాలనలో మాత్రమే జరిగిందని తెలియజేశారు. కోట్లాది రూపాయల నిధులతో చేసిన చేసిన అభివృద్ధి పనులు కళ్లకు కనిపిస్తుంటే, అంతా అవినీతి సంటూ కూటమి నేతలు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను నిత్యం ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనలేకే కేసులు మీద కేసులు మోపి జైలుకు పంపారని మండిపడ్డారు. ఒక్క కేసులోనైనా ఆధారాలు చూపితే తాను కూడా మా నాన్నతో పాటుగా జైలుకు పోతానని తెలియజేశారు. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని, ఎన్ని ఇబ్బందులు పెట్టినా సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు తాము అండగా ఉండటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, ఎంపీటీసీలు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, పార్టీ జిల్లా నాయకులు ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, మంచు శ్రీనివాసులు నాయుడు, ఆరుగుంట జగదీష్, డక్కిలి రమణయ్య, షాజహాన్, ముంగర శ్రీనివాసులు, గుమ్మా మోహన్, డేగా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ పోస్టర్లను చూపుతున్న కాకాణి పూజిత, వైఎస్సార్‌సీపీ నేతలు

అవార్డు గ్రహీతలకు అభినందన

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, సోషల్ వర్క్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.వెంకటసుబ్బారెడ్డిలను వీసీ అల్లం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత ఆదివారం ఒక ప్రకటనలో అభినందించారు. వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి విశ్వగురు ఓల్డ్ రికార్డ్స్ సంస్థ జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులను హైదరాబాద్‌లో ఆదివారం అందించారు. ఇందులో భాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్ సోషల్ సర్వీస్ విభాగంలో జాతీయ స్థాయి అవార్డును వీఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ ఉదయ్‌శంకర్‌కు, రాష్ట్రస్థాయి అవార్డును సోషల్ వర్క్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.వెంకటసుబ్బారెడ్డికి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ అలిశెట్టి చేతుల మీదుగా అందజేశారు. ఈ క్రమంలో వారిని వీఎస్‌యూ వీసీ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అభినందించారు.



అవార్డులు అందుకుంటున్న ఉదయ్‌శంకర్, బి.వెంకటసుబ్బారెడ్డి

చిత్రలేఖన ఉపాధ్యాయుడికి పురస్కారం

కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): బుచ్చిరెడ్డిపాళెంలోని బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చిత్రలేఖన ఉపాధ్యాయుడు దోర్నాదుల వెంకటశేషయ్యకు మాదేటి రాజాజీ పురస్కారం దక్కింది. భగీరథి ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రిలో ఆదివారం జరిగిన పురస్కారాల ప్రదానోత్సవంలో ఏఎస్పీ మురళీకృష్ణ, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు లక్ష్మి చేతుల మీదుగా అవార్డును అందజేశారు. ఈ క్రమంలో వెంకటశేషయ్యకు పాఠశాల హెచ్‌ఎం ఎం.సుజాత, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

కొడవలూరు: స్మార్ట్ మీటర్లను ప్రజలంతా ఐక్యంగా వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ కోరారు. మండలంలోని నార్తురాజుపాళెం ఏఎంసీ ప్రాంగణంలో ఆ పార్టీ మండల మూడో మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై భారం పడుతోందన్నారు. నెల్లూరు నగరంలోని ఓ పిండిమిల్లుకు నెలకు రూ.6 వేలు కరెంటు బిల్లు వస్తుండగా స్మార్ట్‌మీటర్ బిగించాక రూ.20 వేల బిల్లు వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు బిల్లులు పెంచమని చెప్పి స్మార్ట్ మీటర్ల రూపంలో ప్రజలపై పెనుభారం మోపుతోందన్నారు. కరేడులో ఇండోసోల్ పరిశ్రమకు 8,400 ఎకరాల భూమి అప్పజెప్పేందుకు కూటమి ప్రభుత్వం జీఓ తెచ్చిందని, దీనిపై సేవ్ కరేడు పేరుతో ఆందోళన చేపడితే దానిని అణచి వేసేందుకు స్థానిక ఎమ్మెల్యే యత్నిస్తుండడం దారుణమన్నారు. పోరాటం చేస్తున్న గిరిజనులు, సీపీఎం నాయకులపై కేసులు పెట్టించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. మండలంలోని యల్లాయపాళెంలో అత్యధికంగా వ్యవసాయ కార్మికులు ఉన్నారని, వీరు పనుల్లేక నెల్లూరు నగరానికి పనుల కోసం వెళ్తున్నారన్నారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమలు స్థాపించి ఇక్కడి వారికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు టి.గోపాల్, ఎం.పుల్లయ్య, జి.దయాకర్, డి.రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా రామిరెడ్డి



రామిరెడ్డిని అభినందిస్తున్న కర్నాటి

మనుబోలు: బీజేపీ మండల నూతన అధ్యక్షుడిగా బద్దెవోలు గ్రామానికి చెందిన వాసిరెడ్డి రామిరెడ్డిని ఇటీవల పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. ఈ క్రమంలో ఆదివారం బద్దెవోలులో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. పార్టీ నాయకులు రవీందర్‌రెడ్డి, బోలా శ్రీనివాసులు, పెనుమల్లి రామకృష్ణారెడ్డి, ఒలిపి శ్రీనివాసులు, అజయ్‌రెడ్డి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్

కోవూరు: కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్ అన్నారు. స్థానిక సీతా పోలయ్య భవనంలో కౌలు రైతుల సంఘ మండల మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ' వంటి పథకాలు నేరుగా అందేలా చూడాలన్నారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా సీసీఆర్ కార్డులు ఇవ్వడానికి చట్ట సవరణ చేయాలని తెలిపారు. అలాగే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం వ్యవసాయ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘ జిల్లా అధ్యక్షుడు ముత్యాల గురునాథం మాట్లాడుతూ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు అమలు చేయడంపై రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని, దీనిని ప్రభుత్వం నిలిపి వేయాలన్నారు. లేకుంటే స్మార్ట్ మీటర్లు పగలగొట్టే స్థాయిలో రైతులు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. తర్వాత తొమ్మిది మంది సభ్యులతో మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కందిపాటి తిరుపతిని కార్యదర్శిగా, కరకంబాక గోవర్ధన్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామంటూ కమిటీ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు.